క్లుప్తంగా

అవసరమైన పనులు గుర్తించాలి



ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

వెలిగండ్ల: 2023–24 ఆర్థిక సంవత్సరంలో పనుల ప్రదేశాన్ని పరిశీలించిన తర్వాతే పనులు మంజూరు చేస్తామని మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్ అన్నారు. మండలంలోని కొట్టాలపల్లి, నాగిరెడ్డిపల్లి, కంకణంపాడు గ్రామాల్లో ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్, ఎంపీడీఓ టి.సుకుమార్, ఉపాధి సిబ్బంది మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ అనువైన చోట పనులు గుర్తిస్తే ఆ పనులు గ్రామానికి ఉపయోగపడతాయన్నారు. మూడు పంచాయతీల్లో 22 పనులను గుర్తించగా వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. టీఏ మనోహర్, ఆదినారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మూరక ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆస్పత్రిలో ఆరోగ్య సిబ్బందికి మంగళవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఉపకేంద్రలో పనిచేసే ఎంఎల్ హెచ్‌పీలు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. సాయంత్రం అనారోగ్యంగా ఉన్న వారికి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో రోగి ఇంటికి వెళ్లి వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణపై వివరిస్తున్న డీఆర్‌ఓ వెంకటసుబ్బయ్య

పామూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీ శాఖ డీఆర్‌ఓ అన్నెబోయిన వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని కోడిగుంపల వద్ద జరుగుతున్న ఉపాధి పనులు ప్రాంతాన్ని మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన పర్యావరణ పరిరక్షణ ప్రజల బాధ్యతపై కూలీలకు, మేట్లకు వివరించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రతివ్యక్తి మొక్కలు నాటి వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటిని దుర్వినియోగం చేయకుండా పొదుపుగా వాడుకోవడం ప్రకృతికి చేసే మేలన్నారు. భావి తరాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించేందుకు నడుం బిగించాలన్నారు. ఎఫ్‌బీలు రోజారమణి, దొరసాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలి



టంగుటూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నారదముని

టంగుటూరు: దోమల నిర్మూలనకు ఎబేట్ పిచికారీతోపాటు ఫాగింగ్ చేయాలని నియోజక వర్గ ప్రత్యేక అధికారి బి.నారదముని ఆదేశించారు. టంగుటూరు మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, మురుగు సక్రమంగా ప్రవహించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో 1400 పందులు ఉండగా, అందులో 400 పందులను బయటకు తరలించారని, త్వరలో పందుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి మిలిగిన పందులను బయటకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్‌బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులతో నీతి కథలు, మహనీయుల చరిత్ర చదివించి వాటిపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించగా 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక వైద్యశాల పిల్లల వైద్య నిపుణులు సతీష్‌బాబు విద్యార్థులకు ఉపయోగపడే ఆటవస్తువులను సొంత నిధులతో అందించారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరువలేనివి



సీఎస్ పురంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



వలంటీర్లకు పురస్కారాలను అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్

సీఎస్‌పురం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంతో వలంటీర్ల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక ఆర్‌ఎంఎస్ కల్యాణ మండపంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలకు అవార్డులు తగిన గుర్తింపునిస్తాయన్నారు. ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఎం వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీలు దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పెరుగు సుబ్బరామయ్య, డైరెక్టర్ వాడా లక్ష్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మేకల చిన్నతిరుపతిబాలు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, యూత్ అధ్యక్షుడు ఎం ఆటేలయ్య, మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి, నవోదయ హ్యూమన్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు షేక్ గౌస్, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు సీహెచ్ రాధాకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బొట్ల చిరంజీవి, కమ్మనేతి వెంకటేశ్వర్లు, అంబాల చినవెంకటరెడ్డి, అంబాల శేఖర్‌రెడ్డి, దుద్దుకూరి శ్రీను, మిరియం వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ దంతులూరి ప్రకాశం అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందచేసినట్లు తెలిపారు. వలంటీర్ల ద్వారానే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ పథకాలను అర్హతే ప్రమాణికంగా అందచేసినట్లు తెలిపారు. వలంటీర్ల అందరూ బాధ్యతగా పనిచేసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని, మేలును క్షేత్ర స్థాయిలో తమ పరిధిలోని గృహాలకు వివరించాలన్నారు. టీడీపీ హయాంలో దోచుకోవడం.. దాచుకోవడం పంచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 28 సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. అనంతరం ఒక సేవా వజ్రా, 5 మంది సేవారత్న, 174 సేవా మిత్రలకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, ఎంపీపీ ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ అట్లా రామచంద్రారెడ్డి, కోటమ్మ, పోతు వెంకట రమణారెడ్డి, శ్రీహరిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

పీసీపల్లి(కనిగిరి రూరల్): వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల రథ సారధులని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండల కార్యాలయంలో ఎంపీడీఓ రమణారెడ్డి అధ్యక్షతన వలంటీర్లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రతి గ్రామానికి తాగు, సాగు నీరు అందించనున్నట్లు చెప్పారు. వలంటీర్ల పట్ల సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పూర్తి నమ్మకం, విశ్వాసంతో ఉన్నారన్నారు.

ఈ సందర్భంగా 5 మంది వలంటీర్ల సేవా రత్నా, 112 మంది సేవా మిత్ర అవార్డు పురస్కారాలను అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీకాంతం రెడ్డి, వైస్ ఎంపీపీ చెరుకూరి సతీష్ చౌదరి, మండల కన్వీనర్లు జి.బొర్రారెడ్డి, శీలం సుదర్శన్, ఓకే రెడ్డి, మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు వెంకట్రావ్, సర్పంచ్ మరియమ్మ, మేకల మాల్యాద్రి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



పెదకండ్లగుంటలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

అభివృద్ధి, సంక్షేమం జగనన్నకు రెండు కళ్లు

పెదకండ్లగుంట(కొండపి): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తోందని ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో మంగళవారం సాయంత్రం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సీఎం జగనన్న పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని వివరించారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ జగనన్న పాలనకు గత చంద్రబాబు దుర్మార్గపు పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో పేదలకు పథకాలు దక్కకుండా పచ్చచొక్కాలకే అందించారని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన చేస్తున్న జగనన్న మీద ఎంత విష ప్రచారం చేసినా, కూటములు కట్టినా వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. పేదల పక్షాన నిలిచిన నాయకుడు జగనన్నకే ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. గ్రామాల్లో సైతం ప్రజలు కలిసి మెలసి ఉండాలని, మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు బొల్లా సుబ్బారావు, పోకూరి కోటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ గొట్టిపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం లేదు.. మొక్కలు లేవు



కనుమళ్ల గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ కట్టా శోభారాణి

సింగరాయకొండ: పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని, నాటిన మొక్కలు చనిపోయాయని, రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించడం లేదని సోషల్ ఆడిట్ బృందం సభ్యులు గ్రామసభలో ఆరోపించారు. మండలంలోని కనుమళ్ల, సోమరాజుపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌పై గ్రామసభ నిర్వహించారు. కనుమళ్ల పంచాయతీలో రూ.51 లక్షలతో పనులు చేపట్టినట్లు డీఆర్పీ ఖాజా తెలిపారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి రిజిష్టర్లు, డాక్యుమెంట్లు సక్రమంగా నమోదు చేయలేదని, హాజరు పట్టికలో దిద్దుబాట్లు ఉన్నాయని సభ్యులు ఆరోపించారు. కూలీలు తమకు రోజుకు వేతనం రూ.40 నుంచి 150 మాత్రమే వస్తోందని చెప్పారు. తక్కువ మంది పని చేస్తే ఎక్కువ మందికి హాజరు వేస్తున్నారని, అమెరికాలో ఉన్నవారికి కూడా హాజరు వేశారని కనుమళ్ల సహకార సొసైటీ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు ఆరోపించారు. పనిప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేయలేదని తన పరిశీలనలో తేలిందని డీఆర్పీ తెలిపారు. కూలీలు అర్ధంతరంగా వెళ్లిపోవడంతో గ్రామ సభ ముగించారు.

సోమరాజుపల్లి పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో డీఆర్పీ శివ మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.84.60 లక్షల విలువైన పనులు చేపట్టినట్లు తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద 400 మొక్కలు నాటితే 120 మాత్రమే ఉన్నాయన్నారు. జాబ్‌కార్డులు చాలామందివి రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. హాజరుపట్టికలో దిద్దుబాట్లు ఉన్నాయని, వేతనం తక్కువగా పడుతోందని జాబ్‌కార్డుదారులు ఆరోపించారు. ఎంపీపీ కట్టా శోభారాణి, సర్పంచ్ మలినేని ఇందిర, పాకల పశువైద్యాధికారి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు ఎం.సునీత, సుధాకర్, టీఏ రాజారావు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటాద్రి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటా



మృతురాలి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వెలిగండ్ల: బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని జిళ్లెళ్లపాడుకు చెందిన కోటా రాధ దారుణహత్యకు గురైంది. శోకసంద్రంలో ఉన్న కోటా రాధ తల్లిదండ్రులు సుధాకర్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మంగళవారం పరామర్శించారు. తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కోటా రాధను దారుణహత్య చేసిన నిందుతునికి కఠినశిక్ష పడేలా చేయాలని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. కుటుంబసభ్యులకు ఎలాంటి సహాయం కావాలన్నా వెంటనే చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు వై నాగూర్‌యాదవ్, మేడం ఆదిరెడ్డి, చిలకల రమణయ్య, యెలికె నారాయణ, కె వెంకట్రామయ్య, గంజి రవీంద్ర, హుస్సేన్‌పురం ఎంపీటీసీ డి.జనార్దన్‌రెడ్డి, పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి



మురుగు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైవే అధికారులు

సింగరాయకొండ: జాతీయరహదారి పక్కన కనుమళ్ల జంక్షన్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగును మంగళవారం జాతీయ రహదారి ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. సర్వే నెంబరు 607–2ఏ లోని తన పంట పొలాల్లోకి మురుగు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమేపల్లి అరుణకుమారి హైకోర్టును ఆశ్రయించి ప్రతివాదులుగా వివిధ శాఖల అధికారులను చేర్చారు. దీనిపై ముందస్తు చర్యల్లో భాగంగా వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. జాతీయ రహదారి సైట్ ఇంజినీర్ ఆదిత్య, రెసిడెంట్ ఇంజినీర్ ఆర్.సత్తిబాబు, సర్వేయర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోనేరు సెంటర్: వ్యాను బోల్తాపడిన ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. బందరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన వ్యక్తి ఈ నెల 21వ తేదీన ఏపీ 36 టీఎఫ్ 3617 నంబరు గల బొలెరో వ్యాన్‌లో పాలకొల్లుకు బయలుదేరాడు. బందరు మండలంలోకి ప్రవేశించిన వ్యాను ప్రమాదవశాత్తు బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. క్షతగాత్రుడిని మచిలీపట్నంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న బాధితుడు మంగళవారం మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు 94407 96417, 08672223322కు సమాచారం అందజేయాలని ఎస్‌ఐ చాణక్య కోరారు.

తూకాల్లో తేడాలపై రైతుల ఆందోళన



పొగాకు బేళ్లను తూకం వేస్తున్న దృశ్యం

కందుకూరు: పొగాకు బేళ్ల తూకంలో వచ్చిన తేడాలపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కనిగిరి రోడ్డులోని ఒకటవ పొగాకు వేలం కేంద్రంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం పెరికపాలెం గ్రామానికి చెందిన రైతులు పొగాకు బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. సాధారణంగా రైతులు తమ బేళ్లను ఇంటి వద్దే కాటా వేసుకుని వేలం కేంద్రానికి తీసుకొని వస్తుంటారు. వేలం కేంద్రంకు వచ్చిన తరువాత వేలం కేంద్రంలో పనిచేసే కార్మికులు మరోసారి బేళ్లను వేలం వేసి బరువును నిర్ధారించి వేలానికి ఉంచుతారు. ఈ క్రమంలో మంగళవారం పొగాకు వేలం కేంద్రంలో పొగాకు బేళ్లను వేలం వేసే క్రమంలో వ్యత్యాన్ని రైతులు గమనించారు. ఇంటి దగ్గర తాము వేసిన తూకానికి, వేలం కేంద్రంలో వేసిన తూకానికి దాదాపు 10 కేజీల వరకు తేడా ఉండటాన్ని రైతులు గమనించారు. సాదారణంగా 100 కేజీలను ఒక బేళ్లుగా కట్టుకుని రైతులు వస్తుంటారు. ఇంటి దగ్గర 100 కేజీలు ఉన్న బేళ్ల వేలం కేంద్రంలో దాదాపు 10 కేజీల వరకు తక్కువ చూయిస్తుండడంతో అనుమానం వచ్చిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మరో కాటాను పెట్టి పరిశీంచగా రైతుల అనుమానమే నిజమైంది. దీంతో ఎక్కడ పొరపాటు జరుగుతుందో పొగాకు బోర్డు అధికారులు గుర్తించి సరిదిద్దారు. పొగాకు బేళ్లను తూకం వేసే కాటాకి కింద భాగంలో ఓ నట్టు ఊడిపోవడం వల్ల ఈ తేడా వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇది కార్మికులు గమనించకపోవడం వల్ల జరిగిన పొరపాటుగా అధికారులు రైతులకు సర్దిచెప్పారు. అప్పటికే తూకం వేసిన అన్ని బేళ్లను మరోసారి తూకం వేసి వేలానికి ఉంచారు. దీంతో రైతులు ఆందోళన విరమించి వేలం సజావుగా సాగేందుకు అంగీకరించారు. కేవలం చిన్న పొరపాటు వల్లే ఇది జరిగిందని, ఎటువంటి సమస్య లేదని అధికారులు తెలిపారు. అనంతరం మంగళవారం వేలం సజావుగా సాగింది.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఉపయోగించుకోవాలి



గ్రంథాలయంలో కథలను చూపుతున్న విద్యార్థులు

టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు గుమ్మడి వర్ధనరాజు తెలిపారు. మంగళవారం విద్యార్థులకు కథలు చెప్పించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి, కథనం అనే సంభాషణ నాటిక రూపకల్పన చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

35 పొగాకు బేళ్లు తిరస్కరణ



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం నిర్వహించిన వేలంలో 35 పొగాకు బేళ్లను వివిధ కారణాల వల్ల వ్యాపారులు తిరస్కరించారు. జమ్ములపాలెం, తుమాడు గ్రామాలకు చెందిన రైతులు 887 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 852 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.199.61 పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

టంగుటూరు విద్యార్థినికి జిల్లా స్థాయి అవార్డు



స్పందనను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.స్పందన జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన ఇంటర్మీడియెట్ బైపీసీలో 972/1000 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. విద్యాశాఖ అధికారులు ఈ నెల 27న నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డుతోపాటు రూ.50 వేల నగదు అందుకోనుందని చెప్పారు. ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు చిడిపోతు వెంకటేశ్వర్లు, ఉన్నం వెంకట సుబ్బయ, కారుమంచి సుబ్బారావు తదితరులు అభినందించారు.

ఉలవపాడు వైద్యశాల ఆకస్మిక తనిఖీ

- సిరంజీల డిస్పోస్ తీరుపై డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ ఆగ్రహం



సిరంజీల డిస్పోజ్ తీరుపై డీసీహెచ్‌యస్ అసహనం

ఉలవపాడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ నెల్లూరు జిల్లా వైద్య శాలల సమన్వయకర్త డాక్టర్ రమేష్‌నాథ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని అన్ని రూంలను ఆయన పరిశీలించారు. ఇంజక్షన్‌లు వేసిన తరువాత సిరంజ్‌లు, సూదులు డిస్పోజ్ చేసే విధానంపై అసహనం వ్యక్తం చేశారు. పూర్తిగా డిస్పోజ్ అయి వాటిని ఎవరికి ఇబ్బంది లేకుండా పడేయాలన్నారు. వైద్యశాలకు వచ్చే రోగులు, బంధువులతో చిరునవ్వుతో మాట్లాడి వారికి సేవ చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కౌంటర్‌ను పరిశీలించి ఆరోగ్య మిత్ర ద్వారా అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు ప్రభుత్వం ద్వారా వస్తున్న అసరా పథకం డబ్బులు కొంతమందికి ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. నవశకంలో పేరు నమోదు కాకపోవడంతో వారికి రావడం లేదని తెలిపారు. గర్భిణీగా ఉన్నప్పుడే నవశకం పోర్టల్‌లో నమోదు చేయించాలని సిబ్బందికి తెలిపారు. వైద్యశాలలోని ఓపీ రూమ్, లేబరేటరీ, ఎక్స్‌రే గది, అత్యవసర గది, కాన్పుల గది, ఆపరేషన్ గది, వార్డులను పరిశీలించారు. వైద్యశాల రికార్డులను పరిశీలించారు. వైద్యశాలలో కాన్పు తరువాత బహుమతులు అందించారు. ఎండలకు రోగులకు, బంధువులకు అందించే మజ్జిగను కూడా ఆయన అందించారు. పిల్లల వైద్య నిపుణులు సతీష్‌బాబు, గైనకాలజిస్టు శివానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలి

- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గారావు

మద్దిపూడి: నూతన సాంకేతిక పద్ధతులతో రైతులు వ్యవసాయం చేయాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గా ప్రసాద్ తెలిపారు. మంగళవారం కూచిపూడి రైతు భరోసా కేంద్రంలో నూతన వ్యవసాయ పద్ధతులపై వాటర్ షెడ్ రైతులకు మొదటి రోజు శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ తరగతుల్లో రోజు వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక విభాగాల్లో శాస్త్రవేత్తలతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. వాటర్‌షెడ్ రైతులు నూతన సాంకేతిక వ్యవసాయ పద్ధతులు తెలుసుకోవాలని సూచించారు. మొదటి రోజు నేల, ఆరోగ్యం వర్షం నీటిని ఎలా జాగ్రత్త చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉష, డాక్టర్ ఎం.శివ, సుబ్బారావు, ఏపీడీ కోటేశ్వరరావు, టెక్నికల్ ఆఫీసర్ తిరుపతమ్మ, బీఎస్ మణిక్యప్ప, ఏఓ సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మతల్లి దేవస్థానం చైర్మన్‌గా కొండయ్య



నూతన పాలక మండలి సభ్యులు

కామేపల్లి(కొండపి): జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలోని పోలేరమ్మతల్లి దేవస్థానం చైర్మన్‌గా సూరంపల్లి కొండయ్య పాలక మండలి సభ్యులతో కలిసి మంగళవారం ప్రమాన స్వీకారం చేశారు. దేవస్థాన అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలక మండలి సభ్యులకు శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబును పెదకండ్లగుంటలో చైర్మన్ కొండయ్య కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, ఈఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.